# కరెంట్ అఫైర్స్

## తెలుగు రాష్ట్రాల్లో నూతన హైకోర్టులు

★ కొత్త సంవత్సరం తొలి రోజున ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా తెలుగు రాష్ట్రాల్లో విడివిడిగా హైకోర్టులు కొలువుదీరాయి.

★ తెలంగాణ రాష్ట్ర హైకోర్టు తొలి ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ టీబీఎన్ రాధాకృష్ణన్‌తో గవర్నర్ నరసింహన్ ప్రమాణం చేయించారు. తర్వాత హైకోర్టు ఆవరణలో ప్రధాన న్యాయమూర్తి హోదాలో జస్టిస్ టీబీఎన్ రాధాకృష్ణన్ మిగిలిన 12 మంది న్యాయమూర్తులతో ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ కార్యక్రమానికి సీఎం కేసీఆర్ హాజరయ్యారు.

★ విజయవాడలోని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో గవర్నర్ నరసింహన్ తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ చాగరి ప్రవీణ్‌కుమార్‌తో పాటు మరో 13 మంది న్యాయమూర్తులతో ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యమంత్రి చంద్రబాబు హాజరయ్యారు.

★ విజయవాడ సీఎం క్యాంపు కార్యాలయంలో హైకోర్టు తాత్కాలిక భవనాన్ని సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ రమణ ప్రారంభించారు.

★ రాష్ట్రపతి ఉత్తర్వుల ప్రకారం 2019, జనవరి ఒకటి నుంచి తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు ప్రత్యేక హైకోర్టులు ఉనికిలోకి వచ్చాయి. గవర్నర్ నరసింహన్ ముందుగా హైదరాబాద్ రాజ్‌భవన్‌లో తెలంగాణ ప్రధాన న్యాయమూర్తితో ప్రమాణం చేయించి, తర్వాత విజయవాడ చేరుకుని ఏపీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి, న్యాయమూర్తులతో ప్రమాణం చేయించారు.

## నూతన సీఐసీగా సుధీర్‌భార్గవ

★ 2019, జనవరి 1న కేంద్ర ప్రధాన సమాచార కమిషనర్ (సీఐసీ)గా సుధీర్‌భార్గవతో రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ ప్రమాణ స్వీకారం చేయించారు.

★ సుధీర్‌భార్గవతోపాటు కొత్తగా నియమితులైన మరో నలుగురు సమాచార కమిషనర్లు యశ్‌వర్ధన్ కుమార్‌సిన్హా, వనజ ఎన్ సర్నా, నీరజ్‌కుమార్ గుప్తా, సురేష్ చంద్ర బాధ్యతలు స్వీకరించారు.

★ ప్రధాన సమాచార కమిషనర్ ఆర్.కె. మాథుర్‌తో పాటు ఇటీవల ముగ్గురు సమాచార కమిషనర్లు మాడభూషి శ్రీధరాచార్యులు, యశోవర్ధన్ ఆజాద్, అమితవ్ భట్టాచార్య పదవీ విరమణ చేశారు.

★ సీఐసీలో ప్రధాన సమాచార కమిషనర్‌తో కలిపి 11 మంది సమాచార కమిషనర్లు ఉండవచ్చు. తాజా నియామకాలతో వీరి సంఖ్య ఎనిమిదికి చేరింది.

★ సుధీర్‌భార్గవ 2015, జూన్ నుంచి కేంద్ర సమాచార కమిషన్‌లో సమాచార కమిషనర్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. తాజాగా 9వ సీఐసీగా బాధ్యతలు చేపట్టారు. సమాచార హక్కు చట్టం - 2005 కింద ఏర్పడిన కేంద్ర సమాచార కమిషన్ 2005, అక్టోబరు 12 నుంచి కార్యకలాపాలు నిర్వహిస్తోంది.

## బంగ్లా పీఠం హసీనాదే

★ బంగ్లాదేశ్ 11వ పార్లమెంట్ ఎన్నికల్లో ప్రధానమంత్రి షేక్ హసీనా (71) నేతృత్వంలోని మహాకూటమి ఘనవిజయం సాధించింది. 2018, డిసెంబరు 30న జరిగిన ఎన్నికల్లో మొత్తం 300 స్థానాలకుగాను హసీనాకు చెందిన అవామీలీగ్, దాని మిత్రపక్షాలు 288 చోట్ల విజయం సాధించాయి. పోలైన ఓట్లలో 82 శాతం మహాకూటమికే దక్కాయి.

★ విపక్ష పార్టీలతో కూడిన జాతీయ ఐక్యతా కూటమి (ఎన్‌యూఎఫ్) 15 శాతానికి పైగా ఓట్లతో 7 సీట్లు, ఇతరులు 3 గెలిచినట్లు ఎన్నికల సంఘం ప్రకటించింది. ఒక స్థానంలో ఎన్నికలు వాయిదా పడగా, మరో స్థానంలో అభ్యర్థి మరణంతో ఫలితాలను ప్రకటించలేదు.

★ తాజా ఫలితాల నేపథ్యంలో బంగ్లాదేశ్ ప్రధానిగా వరుసగా మూడోసారి, మొత్తంగా నాలుగోసారి బాధ్యతలు చేపట్టేందుకు హసీనాకు మార్గం సుగమమైంది. 2008లో జరిగిన ఎన్నికల్లో 263 సీట్లు సాధించిన హసీనా, ఈసారి 288 స్థానాల్లో గెలిచి ఆ రికార్డు తిరగ రాశారు.

★ తాజా ఎన్నికల్లో నైరుతి గోపాల్‌గంజ్ నుంచి పోటీచేసిన ప్రధాని హసీనాకు 2,29,539 ఓట్లు రాగా, ఆమెపై పోటీ చేసిన ఎన్‌యూఎఫ్ అభ్యర్థికి కేవలం 123 ఓట్లు వచ్చాయి.

## మృణాల్‌సేన్ అస్తమయం

★ సుప్రసిద్ధ బెంగాలీ దర్శకుడు మృణాల్ సేన్ (95) 2018, డిసెంబరు 30న కోల్‌కతాలో మరణించారు.

★ మృణాల్‌సేన్ 1923, మే 14న ప్రస్తుతం బంగ్లాదేశ్‌లో ఉన్న ఫరీద్‌పూర్‌లో జన్మించారు. 1955లో 'రాత్‌భోరే'తో దర్శకుడిగా చిత్రసీమలో అడుగుపెట్టారు. తన చిత్రాల ద్వారా సమాజంలోని సమస్యలను వెండితెరపై ఆవిష్కరించారు. ఆయన రెండో చిత్రం 'నీల్ ఆకాషర్ నీచే' భారత ప్రభుత్వం నిషేధించిన తొలి సినిమా.

★ 'భువన్ షోమ్' చిత్రంతో భారతీయ సినిమాపై చెరగని ముద్రవేశారు. ఇప్పుడు సమాంతర సినిమాగా వ్యవహరిస్తున్న 'ఇండియన్ ఆర్ట్ సినిమా' లేదా 'న్యూవేవ్ సినిమా'కు నాంది పలికింది ఈయనే. 'ఖరీజ్', 'ఏక్‌దిన్ ప్రతిదిన్', 'ఖాన్‌దార్' లాంటి చిత్రాలు అంతర్జాతీయంగా ప్రశంసలు అందుకున్నాయి.

★ మృణాల్‌సేన్ తన చివరి చిత్రం 'ఆమార్ భువన్' (2002) ను సమాజంలో పెరుగుతున్న అసహనం కథాంశంగా రూపొందించారు. ఆయన సినిమాలకు నేపథ్యం, కథా వస్తువు కోల్‌కతా నగరమే.

★ మృణాల్ తెలుగులో (1977) 'ఒక ఊరి కథ'ను తెరకెక్కించారు. గ్రామీణ జీవితంలోని దుర్భర పరిస్థితులను ఇందులో కళ్లకు కట్టారు. ఈ సినిమా ఉత్తమ ప్రాంతీయ చిత్రంగా జాతీయ పురస్కారం గెలుచుకుంది. మృణాల్ 1981లో పద్మభూషణ్, 2005లో దాదాసాహెబ్ ఫాల్కే పురస్కారాలను అందుకున్నారు.

## ప్రధాని పర్యటన

★ 2018, డిసెంబరు 30న ప్రధాని నరేంద్ర మోదీ అండమాన్ దీవుల్లో పర్యటించారు. కార్ నికోబార్ దీవిలోని బీజేఆర్ స్టేడియంలో జరిగిన బహిరంగ సభలో మోదీ పాల్గొని ప్రసంగించారు. 2004లో సంభవించిన సునామీ మృతుల స్మారక స్థూపం వద్ద నివాళులు అర్పించారు.

★ పోర్ట్‌బ్లెయిర్‌లోని సెల్యులార్ జైలును మోదీ సందర్శించారు. ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు వీర్ సావర్కర్‌ను బంధించిన గదిలో మోదీ నేలపై ధ్యానముద్రలో కూర్చున్నారు. 'కాలాపానీ'గా పిలిచే ఈ జైలును 1896 - 1906లో నిర్మించారు.

★ అండమాన్‌లోని మూడు దీవుల పేర్లను ప్రధాని మోదీ మార్చారు. రాస్ ఐలాండ్ పేరును నేతాజీ సుభాష్ చంద్రబోస్ ద్వీప్‌గా, నీల్ ఐలాండ్‌ను షహీద్ ద్వీప్‌గా, హేవ్‌లాక్ ఐలాండ్‌ను స్వరాజ్ ద్వీప్‌గా మార్చారు. నేతాజీ సుభాష్ చంద్రబోస్ అండమాన్ నికోబార్ లోని పోర్ట్‌బ్లెయిర్‌లో త్రివర్ణ పతాకాన్ని ఆవిష్కరించి 75 ఏళ్లు పూర్తయిన సందర్భంగా 75 రూపాయల నాణేన్ని, తపాలా బిళ్లను ప్రధాని మోదీ విడుదల చేశారు.

★ 1943, డిసెంబరు 30న పోర్ట్‌బ్లెయిర్‌లో జాతీయ జెండాను బోస్ ఎగురవేశారు. తాజాగా ప్రధాని మోదీ పోర్ట్‌బ్లెయిర్‌లోని మెరీనా పార్క్‌లో 150 అడుగుల ఎత్తైన జాతీయ జెండాను ఆవిష్కరించారు.

## మహిళా క్రికెటర్ ఆఫ్ ది ఇయర్

★ అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) 2018 ఏడాది ఉత్తమ మహిళా క్రికెటర్‌గా భారత మహిళల స్టార్ ఓపెనర్ స్మృతి మంధాన ఎంపికైంది. ఈ సీజన్‌లో మంధాన 12 వన్డేలు ఆడి 669 పరుగులు, 25 టీ20ల్లో 622 పరుగులు చేసింది. ఉత్తమ వన్డే క్రికెటర్ అవార్డు కూడా మంధానానే వరించింది.

★ 2007లో భారత పేసర్ జులన్ గోస్వామి తర్వాత ఐసీసీ క్రికెటర్ ఆఫ్ ది ఇయర్ అవార్డు అందుకున్న రెండో భారత మహిళా క్రికెటర్‌గానూ కొత్త రికార్డు నెలకొల్పింది.

★ 2018లో ఆటగాళ్ల ప్రదర్శన ఆధారంగా ఓటింగ్ నిర్వహించి ఎంపిక చేసిన ఐసీసీ వన్డే, టీ20 జట్లలోనూ స్మృతి మంధాన చోటు దక్కించుకుంది. స్మృతితో పాటు పూనమ్ యాదవ్ కూడా ఈ రెండు జట్లలో చోటు దక్కించుకుంది. ఐసీసీ మహిళల టీ20 టీమ్ ఆఫ్ ది ఇయర్ కెప్టెన్‌గా భారత క్రికెటర్ హర్మన్ ప్రీత్‌కౌర్ ఎంపికైంది. వన్డే టీమ్ కెప్టెన్‌గా న్యూజిలాండ్ క్రికెటర్ సుజీబేట్స్ ఎంపికైంది.

**ఈ వారం విశేషాలు**

★ రైల్వే బోర్డు ఛైర్మన్‌గా దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ వినోద్‌కుమార్ యాదవ్ 2019, జనవరి 1న బాధ్యతలు చేపట్టారు. కేంద్ర ప్రభుత్వ ఎక్స్ అఫీషియో ముఖ్య కార్యదర్శిగా, ఐఆర్ఎస్ఈఈ ఛైర్మన్‌గా కూడా ఈయన కొనసాగుతారు. అశ్వనీ లోహనీ స్థానంలో వినోద్‌కుమార్ బాధ్యతలు చేపట్టారు. దక్షిణమధ్య రైల్వే జోన్‌కు రెగ్యులర్ జీఎంగా పనిచేస్తూ అత్యున్నత రైల్వే బోర్డు ఛైర్మన్‌గా ఎంపికైన తొలి అధికారి ఈయనే.

★ దక్షిణ మధ్య రైల్వే ఇన్‌ఛార్జి జనరల్ మేనేజర్‌గా ఆర్.కె. కుల్‌శ్రేష్ఠ 2019, జనవరి 1న బాధ్యతలు స్వీకరించారు.

★ ప్రైవేటు ఆస్పత్రుల్లో చేరిన గర్భిణులు పైసా చెల్లించకుండా వైద్యం చేయించుకునే సౌలభ్యాన్ని కల్పించే 'తల్లి సురక్ష' పథకాన్ని 2018, డిసెంబరు 30న ఏపీ సీఎం చంద్రబాబు ఉండవల్లిలో ప్రారంభించారు.

★ కేంద్ర ఆర్థికశాఖ పార్లమెంట్‌కు సమర్పించిన గణాంకాల ప్రకారం కనీస నిల్వ లేనందుకు ప్రభుత్వ బ్యాంకులన్నీ కలిపి రూ.6,246.44 కోట్లు, అదనంగా ఏటీఎం లావాదేవీలు జరిపినందుకు రూ.4,144.99 కోట్లు జరిమానాలుగా వసూలు చేశాయి. 2015, ఏప్రిల్ నుంచి 2018, సెప్టెంబరు వరకు జరిమానాల రూపంలో మొత్తం రూ.10,391.43 కోట్లను ప్రజల నుంచి వసూలు చేశాయి.

★ సైకిల్‌పై అత్యంత వేగంగా ప్రపంచాన్ని చుట్టొచ్చిన ఆసియా వ్యక్తిగా పుణెకు చెందిన వేదాంగి కులకర్ణి గుర్తింపు సాధించింది.

★ భారత వ్యోమగాములను రోదసిలోకి పంపే మానవసహిత అంతరిక్ష యాత్ర 'గగన్ యాన్'కు 2018, డిసెంబరు 28న కేంద్ర మంత్రి వర్గం ఆమోదం తెలిపింది. ఈ యాత్రకు రూ.10 వేల కోట్లను కేటాయించింది.

★ మూడు రోజుల భారత పర్యటనలో భాగంగా భూటాన్ ప్రధాని లోతెయ్ శెరింగ్ 2018, డిసెంబరు 28న దిల్లీలో ప్రధాని మోదీతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా భూటాన్‌కు రూ.4,500 కోట్ల ఆర్థిక సాయాన్ని ప్రధాని మోదీ ప్రకటించారు. ఆ దేశపు 12వ పంచవర్ష ప్రణాళిక అమలు కోసం ఈ చేయూత అందిస్తున్నట్లు తెలిపారు. 2018, నవంబరులోనే భూటాన్ ప్రధాని బాధ్యతలు చేపట్టిన లోతెయ్‌కు ఇదే తొలి విదేశీ పర్యటన.

★ అసోంలో జాతీయ పౌర నమోదు ప్రక్రియ (ఎన్ఆర్‌సీ)ను పూర్తిచేసేందుకు కేంద్రం గడువు పొడిగించింది. 2018, డిసెంబరు 31కి ఎన్ఆర్‌సీని పూర్తిచేయాల్సి ఉండగా 2019, జూన్ 30 వరకు ఈ గడువును పొడిగించింది.

★ రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) వద్ద మిగులు నిధులు ఎంతమేర ఉంచాలనే అంశంపై ఆర్‌బీఐ మాజీ గవర్నర్ బిమల్ జలాన్ నేతృత్వంలో ఓ కమిటీని ఏర్పాటు చేశారు. ఆరుగురు సభ్యుల ఈ కమిటీకి ఆర్థిక వ్యవహారాల మాజీ కార్యదర్శి రాకేష్ మోహన్ వైస్ ఛైర్మన్‌గా ఉంటారు.

★ పంజాబ్‌లోని జలంధర్‌లో 106వ భారత సైన్స్ కాంగ్రెస్‌ను ప్రధాని నరేంద్ర మోదీ 2019, జనవరి 3న ప్రారంభించారు. 'ఫ్యూచర్ ఇండియా: సైన్స్ అండ్ టెక్నాలజీ' ఇతివృత్తంగా జరిగిన ఈ ఉత్సవాలకు లవ్లీ ప్రొఫెషనల్ యూనివర్సిటీ వేదికగా నిలిచింది.

★ రాష్ట్రవ్యాప్తంగా జనవరి 2 నుంచి 11 వరకు జరిగే ఆరో విడత 'జన్మభూమి - మా ఊరు' కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు తన సొంత నియోజక వర్గం కుప్పం నుంచి ప్రారంభించారు.

★ రాష్ట్రంలో మరో రెండు కొత్త జిల్లాలు ములుగు, నారాయణపేట ఏర్పాటుకు అనుమతిస్తూ 2018, డిసెంబరు 31న ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. జయశంకర్ భూపాలపల్లి జిల్లాను విభజిస్తూ ఒక రెవెన్యూ డివిజన్, 9 మండలాలతో ములుగు జిల్లా, మహబూబ్‌నగర్ జిల్లాలోని ఒక రెవెన్యూ డివిజన్, 12 మండలాలు కలుపుతూ నారాయణపేట జిల్లా ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించింది.

**రచయిత: సీహెచ్. కృష్ణప్రసాద్**